రేపు సత్యవేడుకు మంత్రి లోకేశ్

ఎల్లుండి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి (కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 3.40 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకునే ఆయన రోడ్డు మార్గాన 5.10 గంటలకు సత్యవేడులోని వీఎంకే కల్యాణ మండపం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం 10.50 గంటలకు శ్రీసిటీకి చేరుకుని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం రోడ్డు మార్గాన 2.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని తిరుగుపయనం కానున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు 292మంది గైర్హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సోమవారం 911 మంది అభ్యర్థులకు గాను 619 మంది హాజరయ్యారని, 292మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

తిరుపతి గంగ జాతరకు


నేడు చాటింపు

విశ్వరూప స్థూపానికి అభిషేకం

ఊరేగింపుగా రానున్న అవిలాల పుట్టింటి సారె

తిరుపతి-ఆంధ్రజ్యోతి

తిరుపతి పొలిమేరలో మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సంబరం మొదలుకానుంది. దీనికి ముందు ఉదయం 7 గంటలకు గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అభిషేకం చేసి వడిబాల కట్టడంతో జాతర ప్రాధాన్యత సంతరించుకుంటుంది. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన రూరల్ మండలం అవిలాల నుంచి సారె వస్తుంది. సారెతో పాటు స్థానిక కైకాలవాళ్లు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా కనిపిస్తోంది.



విద్యుత్ దీప కాంతుల్లో గంగమ్మ ఆలయం



గర్భగుడి వద్ద పూల అలంకరణ

రోజుకో వేషం

వేలాది మంది భక్తులు చిత్ర, విచిత్ర వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుంటారు. బుధవారం నుంచి వేషాల జాతర మొదలవుతుంది. తరాల తారతమ్యం భక్తి భావనకు అడ్డురాదని నిరూపిస్తూ వేషాలు వేయడానికి జనం పోటీపడతారు. 7వ తేదీ బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటి వేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేదీ సున్నపుకుండల వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేదీ మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు విశ్వరూప స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. 14వ తేదీ వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప తొలిగించడంతో జాతర పరిసమాప్తమవుతుంది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పండుగ వాతావరణంలో నిర్వహిద్దాం : కలెక్టర్

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జాతరను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతరపై ఆయన సమీక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. సోమవారం ఆయన ఆలయాన్ని పరిశీలించి, అధికారులకు, పోలీసులకు తగు సూచనలు ఇచ్చారు.

క్రిస్ సిటీతో రియల్ ఎస్టేట్ దూకుడు

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వెంచర్లు
- ఎకరా రూ.2.5 కోట్లకు పైమాటే

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ, చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ రానుండడంతో కోట మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ఎడాపెడా వెంచర్లు వేస్తూ వ్యాపారం షురూ చేశారు. కోట మండలం కొత్తపట్నం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం ప్రాంతాల్లో క్రిస్ సిటీ రానుంది. దీనికి సంబంధించిన పనులు వేగం పుంజుకున్నాయి. 250 నుంచి 300 పరిశ్రమల వరకు రానుండడంతో సముద్రతీర గ్రామాలన్నీ ఇండస్ట్రియల్ హబ్‌గా మారిపోనున్నాయి. సముద్రతీరానికి 20నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోట, విద్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటికే ఆక్వా పరిశ్రమలు ఉన్నాయి. దీనికితోడు క్రిస్‌సిటీ, చెన్నై-బెంగళూరు కోస్టల్ కారిడార్ ద్వారా కృష్ణపట్నం పోర్టు అనుసంధానం జరగనున్న నేపథ్యంలో కోట మండలంలోని సముద్రతీర గ్రామాలైన కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, వావిళ్లదొరువు, గున్నంపడియ, యమదిన్నెపాళెం, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల్లో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి.



కోట పట్టణంలో వెలసిన కొత్త వెంచర్



విద్యానగర్‌లో సిద్ధం చేసిన ప్లాట్లు

రూ.వేల నుంచి రూ.లక్షలకు..

విద్యానగర్‌లో హనుమాన్ నగర్, గూడలి రహదారిలో గతంలో అంకణం రూ.40వేల నుంచి రూ.60వేలు పలుకుతుండగా ప్రస్తుతం రూ.2.30లక్షల వరకు పలుకుతోంది. చెందోడు, విద్యానగర్ ప్రాంతంలో ఎకరం రూ.2.5కోట్లకు పైనే పలుకుతోంది. చల్లకాలువ, స్వర్ణముఖి సమీపంలో కొత్తగా వేసిన వెంచర్లలో అంకణం రూ.1.20లక్షల నుంచి 1.40 లక్షలు పలుకుతోంది. ఆ ప్రాంతంలో ఎకరం రూ.2కోట్లకు పైగా పలుకుతోంది. ఇక కోట పట్టణానికి వస్తే అంబేడ్కర్ గురుకులం, రవినగర్ ప్రాంతాల్లో అంకణం రూ.1.50లక్షల నుంచి 1.60లక్షలు పలుకుతోంది. ఇంకొంచెం పట్టణంలోకి వెళితే రూ.1.70లక్షలు పలుకుతోంది. కోట పట్టణంలోనూ భూముల ధరలు బాగా పెరిగాయి. అదేవిధంగా గోవిందపల్లి, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల్లో ఒకప్పట్లో ఎకరం రూ.10లక్షలు ఉండగా ప్రస్తుతం సెటిల్‌మెంట్ భూమి ఎకరం రూ.30 నుంచి రూ.40లక్షల వరకు పలుకుతోంది. కాగా, సముద్రతీర ప్రాంతాల ప్రజలు భూములు, ఆస్తులు పరిశ్రమలకు వదిలివేసి విద్యానగర్, కోట ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పరుచుకునేందుకు పరుగులు తీస్తున్నారు. భూముల ధరలు పెరగడానికి ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

రైతులకు పరిహారం అందించండి

జిల్లా అధికారులతో సీఎం చంద్రబాబు

తిరుపతి(కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయవాడ నుంచి సోమవారం వర్చువల్ విధానంలో ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. పిడుగుపాటుకు నాయుడుపేట, చిల్లకూరు, ఓజిలిలో ముగ్గురు మృతి చెందారని, 30శాతం లోపు పంట నష్టం వాటిల్లిందని కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మృతుల కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని సీఎం ఆదేశించారు. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ గురించి కూడా కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

బిగ్‌బాస్ షోపై నా పోరాటం ఫలించింది

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 5(ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ షో నిర్వాహకులపై తాను కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందని, హైకోర్టు నోటీసులు పంపడం శుభపరిణామమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ బిగ్‌బాస్ షోలు, అందాల పోటీలను నిర్వహించడం నీచ సంస్కృతి అన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడం ముమ్మాటికీ అసాంఘిక చర్యగా అభివర్ణించారు. బిగ్‌బాస్ షో ద్వారా సమాజానికి హాని ఉందన్నారు. ఈ షోలకు ప్రజలు ఆకర్షితులై దేశ సంస్కృతిని చిన్నచూపు చూసే అవకాశముందన్నారు. బిగ్‌బాస్ షోలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ఆపాలని పోలీస్ స్టేషన్లను, కోర్టులను ఆశ్రయించానని చెప్పారు. మూడేళ్లుగా ఈ పోరాటం చేస్తూ చివరకు హైకోర్టును ఆశ్రయించామన్నారు. కొంత కాలయాపన జరిగినా చివరకు హైకోర్టు బిగ్‌బాస్ షో నిర్వాహకులకు నోటీసులు పంపడం ఆనందంగా ఉందన్నారు. బిగ్‌బాస్ షోల ద్వారా నిర్వాహకులు సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలనుకున్నారో వివరణ ఇవ్వాలన్నారు. స్త్రీలను గౌరవిస్తున్న మన దేశ సంస్కృతిలో ఇలాంటి షోలు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణాలో అందాల పోటీలు నిర్వహించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రపంచ దేశాలు భారత దేశ సంస్కృతి వైపు చూస్తుంటే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం స్త్రీలను పాశ్చాత్య సంస్కృతి వైపు మళ్లించే ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. దేశ ప్రజలపై ఇలాంటి ప్రభావాలు పడకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, రాధాకృష్ణ, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

దిగుబడి లేక.. ధర రాక

పడిపోయిన ఎండు మిరప రేట్లు

ఆందోళనలో అన్నదాతలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు అన్నదాతల పాలిట కన్నీటి రాశులుగా మారుతున్నాయి. కోటి ఆశలతో మిరపను సాగు చేసిన రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి పంటను సాగుచేస్తే ఓ వైపు దిగుబడులు రాక, మరోవైపు మార్కెట్లో ధరలు అమాంతం పడిపోవడంతో కొనేవారు లేక రైతులు కుదేలవుతున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లోని మంగళంపాడు, మతకాముడి, ఉగ్గుముడి, దామానెల్లూరు, ఉచ్చూరు, బూదూరులో 2 వేల ఎకరాలకు పైగా మిరప సాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, ఇలా అన్ని కలుపుకుని ఎకరాకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. పచ్చి మిరపకాయలకు ధర లేకపోవడంతో ఎండు మిరపపై ఆశలు పెట్టుకున్నారు. కోత పనులు కూడా పూర్తయ్యాయి. అయితే ధర లేకపోవడంతో మిరపను కల్లాల్లోనే కుప్పలుగా ఆరబోసి పెట్టుకున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలుకుతోంది. రెండేళ్ల కిందట క్వింటాలు రూ.23 వేల నుంచి రూ.26 వేలు వరు ఉండగా, గత ఏడాది రూ.14 వేల నుంచి 16 వేల వరకు తగ్గింది. ఈ ఏడాది ధరలు బాగా తగ్గడంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రెండేళ్ల నుంచి మిరప ధరలు దారుణంగా పడిపోవడంతో కౌలు చెల్లింపు కూడా గిట్టడం లేదని కన్నీరుమున్నీరవుతున్నారు.



కల్లంలో ఆరబోసిన ఎండు మిరప

చెత్త నిర్వహణకు ఐటీసీతో ఒప్పందం

- తిరుపతి కార్పొరేషన్, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీల ఎంపిక

పుత్తూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త నిర్వహణకు ప్రభుత్వం ఐటీసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. రెండు రోజుల క్రితం ఆయా మున్సిపాలిటీల ఇంజనీరింగ్ అధికారులు విజయవాడలో ఐటీసీ సంస్థ నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి వెళ్లి వచ్చారు. ఐటీసీ సంస్థ తడి, పొడి చెత్తను వేరు చేయడం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. కాగితం, ప్లాస్టిక్, లోహాలు వంటి పొడి వ్యర్థాల సేకరణకు ప్రత్యేక సంచులను అందజేస్తుంది. సేకరించిన చెత్తను ఎరువుగా మార్చి విక్రయిస్తుంది. ఇందులో భాగంగా రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సిబ్బందితో కలిసి పరమేశ్వరమంగళం సమీపంలోని సర్వే నెం.218లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు.



స్థల పరిశీలన చేస్తున్న పుత్తూరు కమిషనర్ మంజునాథ్ గౌడ్

సూళ్లూరుపేట కమిషనర్‌పై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్యపై చిత్తూరులో పోలీసులకు ఫిర్యాదు అందింది. సోమవారం చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ స్థానిక వన్ టౌన్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. 'చిన్నయ్య తన తండ్రి బతికుండగా, ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తర్వాత తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు పొందాడు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ (డీఎంఏ) ఆదేశాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు విచారణ ప్రారంభించారు.

చిత్తూరు ఎమ్మెల్యేని కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



జగన్మోహన్‌ను సత్కరిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

చంద్రగిరి, మే 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను సోమవారం తిరుపతి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యంనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. తన పదవికి సహకరించిన జగన్మోహన్‌ను సోమవారం మండల టీడీపీ నాయకులతో కలిసి వెళ్ళి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సుబ్రహ్మణ్యంనాయుడు టీడీపీ నాయకులు గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, మేడసాని కుమార్, నగరం రమేష్, చెంచయ్య నాయుడు, రాజలుగారి వినోద్, లోకాద్రి, ధనంజయలు, లోకేష్, కొండూరి ప్రవీణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత అనుసరణే సన్మార్గం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

చంద్రగిరి, మే 5(ఆంధ్రజ్యోతి): మానవాళి సన్మార్గంలో నడవటానికి, జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి ఏకైక మార్గం భగద్గీతను అనుసరించడమేనని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య అన్నారు. సోమవారం నరసింగాపురం, కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, పుల్లయ్యగారిపల్లె, కొటాల, ఎ.రంగంపేట గ్రామాల్లో భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ, జీవాత్మ పరమాత్మల గురించి తెలుసుకోవాలంటే భగవద్గీతను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధు, పెంచలయ్య, పార్థసారథి, కృష్ణమూర్తి, కిరణ్, వెంకటేశ్వర్లు, హర్షవర్ధన్, మాళవిక, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మ జాతరకు రండి



బీఆర్ నాయుడికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ ఈవో జయకుమార్ తదితరులు

తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు తిరుపతిలో జరుగనున్న తాతయ్యగుంట గంగమ్మ జాతరకు రావాలంటూ టీటీడీ ధర్మకర్తల మండలి బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని ఆలయ ఈవో ఈవో జయకుమార్, అర్చకులు రామకృష్ణశర్మ, పీఆర్వో మురళి ఆహ్వానించారు. సోమవారం తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుని కలిసి జాతరకు సంబంధించిన ఆహ్వానపత్రికను అందజేశారు. అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

ఓవర్‌హెడ్ వాటర్‌సంప్ ప్రారంభం



సంప్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్,ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

తిరుపతి రూరల్, మే5(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీలో రూ.20లక్షల నిధులతో పునరుద్ధరించిన ఓవర్‌హెడ్ వాటర్‌సంప్‌ని సోమవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్,ఎమ్మెల్యే పులివర్తి నానిలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీనివాసపురం, పద్మావతిపురం, ఓటేరు, వేదాంతపురం, గాంధీపురం, అవిలాల పంచాయతీల్లో నీటిసమస్యను అధిగమించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. 2లక్షల లీటర్ల నీటిసామర్థ్యం గల వాటర్‌సంప్‌ను పునరుద్ధరించామన్నారు. గతవైసీపీ హయాంలో నీటిసమస్య ఉన్నా అప్పటిపాలకులు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సమస్యలు తీరుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్డీవో రామ్మోహన్, జెడ్పీసీఈవో రవికుమార్‌నాయుడు, డీపీవో సుశీలాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్ర, పంచాయతీల ప్రతినిధులు, కూటమినాయకులు పాల్గొన్నారు. పద్మావతిపురం పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.


దామలచెరువులో దొంగలు పడ్డారు?

పాకాల, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువులో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. రెడ్డివారివీధి, ఊటు కాలువ ప్రాంతాలలో ఇండ్లలోకి వెళ్లడానికి ప్రయత్నించారు. కొన్ని ఇండ్ల తలుపులు తట్టారు. కుక్కలు అరవడంతో స్థానికులు మేల్కొన్నారు. అప్రమత్తమై దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఇద్దరు పురుషులు, ఓ మహిళ దొంగతనానికి ప్రయత్నించారు. అందులో మహిళ, పురుషుడు పారిపోయారు. ఒకడ్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దుండగులు హిందీ భాషలో మాట్లాడుతున్నారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. రాత్రుల్లో పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. కాగా మహారాష్ట్రకు చెందిన కూలీలు ఇక్కడ మండీల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొందరు మద్యం మత్తులో చిరునామా దొరక్క తలుపులు తట్టారని తమ విచారణలో తేలిందని సీఐ సుదర్శన్ ప్రసాద్ చెప్పారు. పట్టుబడిన వ్యక్తిని యజమాని పూచీకత్తుపై విడుదల చేశామన్నారు. కానీ స్థానికులు ఈ సంఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ డిపోలో విజిలెన్స్ తనిఖీలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. డిపోలో పరిపాలన విభాగంలో పనితీరు, అక్రమాలపై నెల్లూరు విజిలెన్స్ డీఎస్పీ ధర్మతేజ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరాతీసి పలు రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది. గత మూడేళ్ల నుంచి డిపోలో పాలన గాడితప్పడమే కాకుండా గతంలో నడుస్తున్న 60 బస్సులు సర్వీసులు నేడు 29కి చేరాయి. అలాగే తరచూ బస్సు సర్వీసులు రద్దు చేయడం పరిపాటిగా మారింది. సిబ్బంది ఉన్నా సర్వీసులను ఎందుకు రద్దు చేస్తున్నారు.. డిపోకు ఆదాయ చేకూర్చే మార్గాల్లో సర్వీసులు పెంచుకోకుండా ఎందుకు కుదిస్తున్నారన్న దానిపై విజిలెన్స్ అధికారులు విచారించారు. ఏప్రిల్ 20న ఒకేరోజు డిపోలో 17 సర్వీసులను రద్దు

నంది వాహనంపై అగస్త్యేశ్వరుడి విహారం



నారాయణవనం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంగా ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారిని నంది వాహనంపై ఊరేగిం చారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకరంలో ఊరేగించారు. సాయం త్రం విశేష పూజలనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని నంది వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం అందుకున్న చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిణిని సోమవారం మండల సమావేశంలో సత్కరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు నరసింహులు

పాకాల, మే 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో దామలచెరువు సమీపంలోని ఎన్‌హిల్స్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సదుం మండలం బూరగమంద పంచాయతీ గాదె వారిపల్లెకు చెందిన ఎ.నరసింహులు (45) కొంతకాలంగా ఎన్‌హిల్స్ నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం సాయంత్రం కల్లూరు నుంచి ఎన్‌హిల్స్ నగర్‌కు మోటారు సైకిల్‌లో వస్తూ ఇంటికి వెళ్లడానికి తిరిగాడు. అదే సమయంలో వెనుక వైపు వస్తున్న కారు బలంగా ఢీకొంది. దీంతో నరసింహులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడికే మృతి చెందాడు. భార్య పిల్లలు బూరగమందలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో సౌకర్యాలు పెరిగాయి

● మాజీ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప

తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సామాన్య భక్తులకు సౌకర్యాలు బాగా పెరిగాయని మాజీ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన అలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన టీటీడీ ధర్మకర్తల మండలి టీటీడీలో అనేక మార్పులు చేసిందన్నారు. ప్రసాదాల నాణ్యత పెంచడంతో పాటు విద్యా, వైద్యం వంటి వాటిల్లో ప్రక్షాళన చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చేపట్టిన పనులన్నీ నెరవేరాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శనివారం హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు లభించింది. ఆదివారం శ్రీవారిని 83,380మంది భక్తులు దర్శించుకున్నారు. 27,936 మంది తలనీలాలు సమర్పించారు.

ఘాట్‌రోడ్డులో అడవి జంతువు మృతి

తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ అడవి జంతువు మృతి చెందింది. మార్గంలోని 12వ కిలోమీటరు వద్ద సోమవారం రోడ్డు దాటుతున్న పిల్లి తరహా వన్యప్రాణిని వాహనం తొక్కించి వెళ్లిపోయింది. దీంతో ఆ జంతువు అక్కడిక్కడే మృతి చెందింది. దాన్ని చూసిన వాహనదారులు పునుగుపిల్లి అని కొందరు, కాదు అడవి పిల్లి అని మరికొందరు అభిప్రాయపడ్డారు.

అనుమానాస్పద స్థితిలో వాటర్ వర్కర్ మృతి

తిరుపతి(నేరవిభాగం), మే 5(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వాటర్ పైపులైను పనులు చేస్తున్న వ్యక్తి మృతిచెందాడు. సోమవారం జీవకోన రోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ లోకేష్ బాబు కథనం మేరకు.. కడప జిల్లా వళ్లూరు గ్రామానికి చెందిన నరసిం హులు(26)కు రెండేళ్ల క్రితం వివాహం అయింది. భార్యకు దూరంగా ఉంటూ ఉపాధి కోసం తిరుపతికి వచ్చాడు. జీవకోన రోడ్డులోని 20 ఇండ్లు వద్ద ప్రైవేటు వాటర్ ప్లాంటులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

మినీ ట్రక్కు ఢీకొని ఆటో, కారు ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం) మే 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి-మంగళం రహ దారిలోని డీ- మార్టు వద్ద సోమవారం మినీ ట్రక్కు ఢీకొని ఆటో, కారు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కథనం మేరకు.. లీలామహల్ నుంచి మంగళం వైపు వెళుతున్న ఆటో డీ మార్టు యూ టర్న్ తీసుకుంది. ఆ సమయంలో తిరుపతి వైపు వస్తున్న కొరియర్ మినీ ట్రక్కు ఢీకొంది. అదే సమయంలో కారుకు కూడా తగిలింది. దీంతో ఆటో, కారు దెబ్బతిన్నాయి. కారు యజమాని వరుణ్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

పోలీసు కుటుంబాలకు ఎస్పీ ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం)మే 5(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ఎస్పీ హర్షవర్ధన రాజు సంక్షేమ నిధి ద్వారా సోమవారం ఆర్థికసాయం అందించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఏఎస్‌ఐ మల్లిఖార్జునరావు సతీమణి పద్మకు, హెడ్ కానిస్టేబుల్ బి.మధుసూదనరావు సతీమణి ఉషారాణికి రూ.లక్ష చొప్పున చెక్కులు సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. ఏవో సురేష్ బాబు పాల్గొన్నారు.

నందిపై సదాశివుడి చిద్విలాసం

పుత్తూరు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదా శివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామిఅమ్మవార్లు నంది వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి ఆదిశేష వాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు.

రైలొచ్చిన సమయంలో టికెట్ ఇవ్వరు

●చంద్రగిరి స్టేషన్‌లో ఇబ్బందులు● వేధిస్తున్న సిబ్బంది కొరత



టికెట్లు ఇచ్చేది..రైళ్లకు సిగ్నల్ ఇచ్చేది స్టేషన్ మాస్టరే..

చంద్రగిరి, మే 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ బుకింగ్ కౌంటర్ ఉన్నా లేనట్టే ఉంది. తత్కాల్, అడ్వాన్స్ బుకింగ్, రిజర్వేషన్ చేయించుకోవాలంటే కష్టమే. సిబ్బంది కొరతే ఇందుకు కారణవ. తిరుపతి రైల్వే స్టేషన్‌లో రద్దీ దృష్ట్యా స్థానికులకు సౌకర్యం కోసం ఇక్కడి స్టేషన్‌లో టిక్కెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇది మహిళా రైల్వే స్టేషన్. స్టేషన్ మాస్టర్ కూడా మహిళా అధికారి ఉన్నారు. చంద్రగిరి మీదుగా రోజూ 7 ప్యాసింజర్ రైల్లు, 38 ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. స్టేషన్ మాస్టరే రైళ్ల రాకపోకలు, బుకింగ్ కౌంటర్ చూడాల్సి వస్తుంది. బుకింగ్ కౌంటర్ రోజూ ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటలకు ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకే ఉంటుంది.

రెండు డ్యూటీలు ఒకరే...

తత్కాల్ ఉదయం 10 గంటలకు ఏసీ కోచ్, 11 గంటలకు స్లీపర్ కోచ్‌లకు బుకింగ్‌లు ప్రారంభమవుతాయి. ఆసమయంలో రైలు వస్తే కౌంటర్‌లో ఉండే స్టేషన్ మాస్టర్ వెళ్ళి లైన్ క్లియర్ చేయాల్సి వస్తుంది. రెండు విధులూ ఒక్కరే నిర్వర్తించాల్సి రావడంతో ప్రయాణికులు తత్కాల్ టిక్కెట్లుకు, ఉదయం అడ్వాన్స్ బుకింగ్‌లకు ఇబ్బంది పడుతున్నారు. స్టేషన్ మాస్టర్‌ను వివరణ కోరగా రైలు సమయంలో టిక్కెట్లు ఇవ్వలేమని, ప్రధానంగా రైలు చంద్రగిరి మీదుగా వెళ్ళడమే ముఖ్యమన్నారు. రైల్వే అధికారులు స్పందించి బుకింగ్ కౌంటర్‌కు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

రూరల్ మండలంలో రూ.2.23 కోట్లతో అభివృద్ధి పనులు: నాని



సమావేశంలో ఎమ్మెల్యే నాని,ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతిరూరల్, మే5(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలో ఇప్పటికే రూ.2.23కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని జరిగింది. పంచాయతీల్లో తాగునీరు, విద్యుత్, యూడీఎస్, డ్రైనేజీ, మఠం భూముల వంటి సమస్యలు, వకుళామాత ఆలయానికి ఆర్టీసీ బస్ సదుపాయం కల్పన వంటి అంశాలను పలువురు ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, ముఖాముఖిలో వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. 917మందికి రూ.29.12కోట్ల మేర బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. తిరుచానూరు స్వర్ణముఖినదిలో అక్రమకట్టడాలు, లేఅవుట్లని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

కాగా స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలపై మాట్లాడుతుండగా వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి మధ్యలో కలుగజేసుకోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్‌లను, ఎంపీటీసీలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. అధికారులపట్ల ఎంపీపీ బెదిరింపు ధోరణితో వ్యవహరించకూడదన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమపంచాయతీ పురస్కారం అందుకున్న చెర్లోపల్లె సర్పంచ్ బొల్లినేని సుభాషిణిని సత్కరించారు. జెడ్పీటీసీ రత్నమ్మ, వైఎస్ ఎంపీపీలు మాధవరెడ్డి, యశోద, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్లు రామాంజులునాయక్, భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ నగదు స్వాహాపై విచారణ

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం



కేశవరం సచివాలయంలో సిబ్బందిని విచారిస్తున్న అధికారులు

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ స్వాహా విచారణ సోమవారం జరిగింది. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజ్‌తో పాటు మండల పరిషత్ అధికారులు కేశవరం సచివాలయానికి చేరుకుని ఏప్రిల్, మే మాసాలకు సంబంధించి పెన్షన్ నగదుపై వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్‌ను విచారించారు. ఏప్రిల్‌లో డీఆర్‌డీఏకు జమ చేయాల్సిన రూ.1,30,500 నగదును ఈనెల 2వ తేదీ గ్రామస్తుల సమక్షంలో అధికారుల వత్తిళ్ల మేరకు జమ చేసినట్లు గుర్తించారు. అదేవిధంగా మే నెలకు సంబంధించి రూ.1.12లక్షల పెన్షన్ నగదును వెల్ఫేర్ అసిస్టెంట్ ఇప్పటికీ డీఆర్‌డీఏకి జమ చేయలేదు. నగదు స్వాహాపై అధికారులు విచారిస్తుండగా ఒక్కసారిగా వెల్ఫేర్ అసిస్టెంట్ పరిగెత్తుకుంటూ వెళ్లి సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జామాయిల్ తోటలోకి వెళ్లి పురుగుమందు తాగి పడిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయనను గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయిం చగా కోలుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు మాట్లాడుతూ ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో రూ .1.50లక్షల పెన్షన్ నగదు స్వాహాపై వార్త ప్రచురితం అయిందని, దీనిపై విచారణ చేయగా వాస్తవమేనని తేలిందన్నారు. ఈ క్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం ప్రయత్నం చేశాడని, ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని పంచాయతీ కార్యదర్శి చెప్పారు.

అనాథ శవాలకు వాహనం ఏర్పాటు చేయండి

● కమిషనర్‌ను కోరిన డిప్యూటీ మేయర్లు ● పీజీఆర్‌ఎస్‌కు 46 వినతులు

తిరుపతి, మే5(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఫోన్ ద్వారా నలుగురు తమ సమస్యలు తెలుపగా, 42మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణలు పాల్గొని అనాథ శవాలను తరలించేందుకు వాహన ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. భవానీనగర్‌లో యూడీఎస్ బ్లాక్ అయిందని పరిష్కారం చూపాలని, డివైడర్లలో ఉన్న మొక్కలకు నీరు పట్టాలని, డబుల్ డెక్కర్ బస్ వినియోగంలోకి తీసుకురావాలని, తిమ్మినాయుడుపాళెం అంబేద్కర్ విగ్రహం వద్ద మద్యం తాగి ప్రజలను కొందరు ఇబ్బంది పెడుతున్నారని ఇందుకు కారణమైన అక్కడి బంకును తొలగించాలని వంటి పలు వినతులు వచ్చాయి. ఆయా వినతులను ఆయా విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

కోర్టుకు 50 చెత్తబుట్టల వితరణ



తిరుపతి, మే5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని న్యాయస్థానాలు, కార్యాలయాలు, న్యాయవాదుల సంఘ కార్యాలయాలకు అవసరమైన 50 ప్లాస్టిక్ చెత్తబుట్టలను కూటమి నాయకులు వితరణ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి వితరణతో సోమవారం న్యాయవాదుల సంఘానికి కూటమి నాయకులు పనబాక లక్ష్మి, సుగుణమ్మ, నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునిక్రిష్ణ, కార్పొరేటర్ నరేంద్ర, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విద్యానాథరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ దినకర్ పాల్గొన్నారు.

రక్షణ గోడను ఢీకొన్న పాల ట్యాంకర్

రేణిగుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన పాల ట్యాంకర్ రక్షణ గోడను ఢీ కొనింది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం మర్రిగుంట వంతెన వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... నెల్లూరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న పాల ట్యాంకర్ మర్రిగుంట జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపు తప్పి రక్షణ గోడును ఢీకొంది. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను పక్కకు తీశారు.

పట్టించుకోండి సారూ !

మురుగుకాలువలోకి తెలుగు 'గంగ'



తిరుపతి అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): మంగళం క్వార్టర్స్ తిరుమలనగర్‌కు వెళ్లే దారిలో తెలుగుగంగ పైపులైను లీకేజీతో నీరంతా వృథాగా మురుగుకాలువలోకి చేరుతోంది. ఆరునెలలుగా వృథా అవుతున్నా సంబంధిత విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. స్థానికులు ఎన్నోసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. వేసవిలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా తక్షణమే లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి పద్మావతీ పరిణయోత్సవాలు



తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు తిరుమలలో వైభవంగా జరుగనున్నాయి. వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో పద్మావతీ దేవిని శ్రీవేంకటేశ్వరునకు ఆకాశరాజు కన్యాదానం చేసినట్లుగా శ్రీవేంకటాచల మహాత్యం గ్రంథంలో పేర్కొన్నారు. ఏటా ఈ తేదీ నుంచి మూడు రోజుల పాటు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీవారి ఉత్సవ మూర్తి మలయప్పస్వామి తొలిరోజు గజ వాహనంపై, రెండోరోజు అశ్వ వాహనంపై, చివరి రోజు గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయం నుంచి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ వేదిక వద్దకు చేరుకుంటారు. పక్కనే పల్లకీలో ఉభయనాంచారుల్ని ఊరేగింపుగా తీసుకొస్తారు.

నందడిగా పెండ్లి వేడుకలు



శోభాయమానంగా తీర్చిదిద్దిన పెండ్లి మండపంలో నిత్యనూతన వధూవరులైన శ్రీవారిని, అమ్మవార్లను కొలువుదీర్చి ఎదుర్కోలు, పూలదండలు మార్చుకోవడం, పూల బంతులాట, నూతన వస్త్ర సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆర్జిత బ్రహ్మోత్సవం రద్దు

అనంతరం శ్రీవారికి కొలువు(ఆస్థానం) నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరుపుతారు. పూల చెండ్లాట ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. మూడురోజుల పాటు ఇలానే పరిణయోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. కాగా, ఈ ఉత్సవాల నేపథ్యంలో మూడురోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

8న మెగా జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీనగర్ కూడలిలో ఉన్న గీతం స్కూల్లో ఈ నెల 8న మెగా జాబ్‌మేళా జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరుసెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాదు, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీలలో 700కుపైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు జరగనున్నాయి. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైన డిగ్రీ, పీజీలో పాస్ అయిన యువతి, యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఎమ్మెల్యే కోరారు. మరిన్ని వివరాల కోసం 9502 677311నెంబరును సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, టీడీపీ నాయకులు మహేష్‌యాదవ్, ఎస్వీయూ అసోసియేట్ ప్రొఫెసర్ రమణ, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లా పరీక్షలు : ఎస్వీయూ వీసీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), మే 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో బీఎల్ మూడవ సెమిస్టర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు వీసీ ప్రొఫెసర్ అప్పారావు పేర్కొన్నారు. అంజిమేడులోని ఈశ్వర్‌రెడ్డి లా కాలేజీ కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాల్‌ప్రాక్టీస్ కింద ఒకరిని డీబార్ చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

ఫోరెన్సిక్ విభాగంపై అవగాహన అవసరం : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) మే5(ఆంధ్రజ్యోతి): పోలీసు విభాగంలోని ప్రతి అధికారి ఫోరెన్సిక్ విభాగంపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. సోమవారం పోలీసు అతిథి గృహంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు శాఖలో పనిచేస్తున్న సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి ఫోరెన్సిక్ విభాగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్ష్యాధారాలు సేకరించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సేకరించిన నమూనాలను జాగ్రత్తలు తీసుకుని వాటిని ల్యాబ్‌కు పంపాలన్నారు. అనంతరం ఇప్పటివరకు ఫోరెన్సిక్ విభాగానికి సంబంధించి ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ డైరెక్టర్ రాజశేకర్, అసిస్టెంట్ డైరెక్టర్ జయ నాగరాజు, జిల్లాలోని ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

కుల గణనతో బీసీలకు ఉజ్వల భవిష్యత్తు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని ప్రధాని మోదీ నిర్ణయించడం చారిత్రాత్మకమని, దీనివల్ల బీసీలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు జల్లి మధుసూధన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ కులగణన వెనుకబడిన తరగతులకు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా ఊతం ఇస్తుందని వివరించారు. ప్రజలందరూ కులగణనకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా నాయకులు నరసింహ యాదవ్, మునిశేఖర్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల కేసు విచారణకు హాజరైన టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), మే 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ముందస్తు అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహించిన టీడీపీ నాయకులపై ఎన్నికల అధికారులు నమోదు చేసిన కేసులో సోమవారం టీడీపీ నాయకులు మన్నూరు సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, రాష్ట్ర నాయకులు సూరా సుధాకరరెడ్డి, దంపూరి భాస్కర యాదవ్, కృష్ణయాదవ్, డాక్టర్ సుధారాణి, పుష్పావతి, డాక్టర్ ఆశాలతలు తిరుపతిలోని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వాయిదాల కోసం హాజరయ్యారు. విచారణ చేసిన న్యాయమూర్తి ఈ కేసును మళ్లీ డిసెంబరు 2కు వాయిదా వేశారు.

ఎమ్మెల్యే కొత్త పీఏగా శ్రీనివాసులు

● విమర్శలు ఎక్కువ కావడంతో మూర్తిని వదిలించుకున్న ఆరణి

తిరుపతి, మే5(ఆంధ్రజ్యోతి): వివాదాల మూర్తిగా విమర్శలు మూటకట్టుకున్న పీఏ (వ్యక్తిగత సహాయకుడు)ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వదిలించుకున్నారు. అతని మాతృసంస్థకు పంపి, కొత్త పీఏని నియమించాలని ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే కోరినట్టు తెలిసింది. ఆ మేరకు పంచాయితీరాజ్ శాఖలో పనిచేసే శ్రీనివాసులు నూతన పీఏగా బాధ్యతలు స్వీకరించారు. ఇదే శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మూర్తి వైసీపీ హయాంలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దగ్గర పీఏగా పనిచేశారు. ఆ సమయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అనేక వివాదాలకు అతను కేంద్రబిందువుగా మారారన్న విమర్శలున్నాయి. అంతేకాకుండా తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పీఏగా ఉన్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లుకు ఇతను సమీప బంధువన్న ప్రచారం జరిగింది. ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చే కూటమి నేతలకన్నా వైసీపీ వారికి ప్రాధాన్యం ఇస్తారన్న ఆరోపణలు వచ్చాయి. అలాంటి వ్యక్తిని ఆరణి శ్రీనివాసులు తిరుపతికి తీసుకురావడం సర్వత్రా అసంతృప్తులు, అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం చేరిన కొత్త పీఏ శ్రీనివాసులు గతంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వద్ద పనిచేసి ఉండటం గమనార్హం.

రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ అనంతపురం బదిలీ

తిరుపతి(వైద్యం), మే 5(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో యూరాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎంజీ ధనుష్‌యాదవ్‌ను అనంతపురం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి బదిలీ చేస్తూ డీఎంఈ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బదిలీ ఉత్త ర్వులను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం



గోవిందయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కెమిస్ట్రీ స్కాలర్ కె.గోవిందయ్య డాక్టరేట్ పొందారు. 'ఫిజికోకెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ ఆర్గానిక్ లిక్విడ్ మిక్చర్స్ త్రో -ఎఫ్‌టీ-ఐఆర్ స్పెక్ట్రల్ అనాలసిస్' అంశంపై ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

జిల్లా అభివృద్ధిపై జేసీ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), మే 5(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జేసీ శుభం బన్సల్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు రోజ్మండ్, ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత హారన్లపై ట్రాఫిక్ కొరడా తిరుపతిలో 20 ఆటోలకు తొలగింపు

తిరుపతి(నేరవిభాగం) మే 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిషేధిత హారన్లపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. డీఎస్పీ రామకృష్ణమాచారి నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పలు బృందాలుగా విడిపోయి నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం తనిఖీలు చేశారు. ప్రధానంగా లైసెన్సులు లేని వాహనాలు, ఆటోలపై దృష్టి సారించారు. ఎస్పీ కార్యాలయం నుంచి గాంధీ రోడ్డు మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకు నిషేధిత హారన్లు వేసుకుని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 20 ఆటోల హారన్లు తొలగించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం) మే 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం సేవించి వాహనాలు నడిపిన తొమ్మిది మందిని సోమవారం తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరుపరచారు. వీరికి ఒక్కొక్కరికి రూ రూ.10వేల వంతున జరిమానా విధించారు.


పీజీఆర్‌ఎస్‌కు పలచబడ్డ జనం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఐలు

తిరుపతి(నేరవిభాగం) మే 5(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జనం పలచబడ్డారు. రెండు నెలలుగా వచ్చిన ఫిర్యాదుదారులతో పోలిస్తే ఈ వారం చాలా తక్కువగా కనిపించారు. జిల్లా నలు మూలల నుంచి దాదాపు 105 మంది విచ్చేసి వినతులు అందించారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యలు, ఆర్థిక తగాదాలు, దంపతుల మధ్య ఘర్షణలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. తొలుత ప్రత్యేక కౌంటర్లలోని సీఐలు వినతులు స్వీకరించారు. వాటిని మళ్లీ ఏఎస్పీల వద్దకు పంపారు. తర్వాత ఎస్పీ వద్దకు పంపారు. తర్వాత ఎస్పీ వారితో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత స్టేషన్ల సిబ్బంది పరిష్కరిం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు రవిమనోహ రాచారి, నాగభూషణరావు, డీఎస్పీలు భక్తవత్సలం, శ్రీనివాసరావు, రవివకుమార్, నరసింహమూర్తి, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా జాతర నిర్వహిద్దాం: కలెక్టర్





విద్యుత్‌కాంతులతో వెలిగిపోతున్న అమ్మవారి ఆర్చి, జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్)/ (నేరవిభాగం) మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర ఘనంగా నిర్వహిం చేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర పాలక కమిషనర్ మౌర్య, జాతర నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి జాతరపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగజాతర రాష్ట్ర పండుగ కావడంతో భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల న్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమ బద్ధీకరణకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బ్యారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గంగ జాతరను పురస్కరించుకుని భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాట్లను డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలతో కలసి ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డీఆర్వో నరసింహులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఏఎస్పీ రవి మనోహరాచ్చారి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు కోడూరు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఆలయం లోపల విద్యుత్ దీపాలంకరణ

ఉత్సవ వివరాలు ఇలా.

మంగళవారం చాటింపు, బుధవారం బైరాగి వేషం, గురువారం బండవేషం, శుక్రవారం తోటివేషం, శనివారం దొరవేషం, ఆదివారం మాతమ్మ వేషం, సోమవారం సున్నపు కుండలు, మంగళవారం గంగమ్మ జాతర సప్పరం, 14 బుధవారం విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుంది.

జాతర ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి: కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, మే5(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా గంగ జాతర ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గంగమ్మ జాతరకు జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం వివిధ శాఖల అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. క్యూ లైన్లు, పొంగళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, వీఐపీలు వెళ్లే క్యూ లైన్లను పటిష్టంగా చేయాలని అన్నారు. దర్శనానంతరం భక్తులు వెలుపలికి వెళ్లే ర్యాంప్, క్యూ లైన్లను ఆర్‌అండ్‌బీ అధికారులు తనిఖీ చేయాలన్నారు. భక్తులు ఆలయ ప్రదక్షణ చేసే మార్గం ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ భక్తుల మధ్య తోపులాట జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఇందిరామైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల అనువుగా ఏర్పాట్లు చూడాలని తుడా అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, ఆర్డీవో రామ్మోహన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆలయ ఈఓ జయకుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, డీఎస్పీలు రామకృష్ణాచారి, భక్తవత్సలం, తుడా ఈ.ఈ.రవీంద్ర, మున్సిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో అనేక వ్యాధులు దూరం



మాట్లాడుతున్న కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్

తిరుపతి(వైద్యం), మే 5(ఆంధ్రజ్యోతి): అనేక రకాల వ్యాధులు చేతుల్లోని క్రిముల వలనే వ్యాపిస్తాయని చేతులను శుభ్రంగా ఉంచుకోవడం వలన పలు వ్యాధులను అరికట్టవచ్చని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్ తెలిపారు. స్విమ్స్‌లో కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ ఆధ్వర్యంలో సోమవారం 'ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం చేతులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. అనంతరం పలువురు వక్తల చేతుల శుభ్రత వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు విశ్వేశ్వరరావు, నోబెల్ ఉజేష్, హరికృష్ణ, రామకృష్ణ, శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విరాటపర్వ ప్రవచనం

తిరుపతి అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మప్రచార పరిషత్ -అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంయుక్తంగా స్థానిక అన్నమాచార్య కళామందిరంలో మంగళం నుంచి మూడు రోజుల పాటు విరాట పర్వంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో పంచసహస్రావధాని, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ ప్రసంగించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పొంద్ర సరేంద్రనాయుడు తెలిపారు. కళా, సాహిత్యాభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

● జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశం
● పీజీఆర్‌ఎస్‌కు 293 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్నకలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని లేదంటే చర్యలు తప్పవని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలనుంచి ప్రజలు వివిధ సమస్యలపై అధికారులకు 293 అర్జీలు అందజేశారు. అందులో 189 అర్జీలు భూసమస్యలపైనే రెవెన్యూశాఖకు వచ్చాయి. ఇక పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజాసంఘాలు, బాధితులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

మా స్థలాలు మాకివ్వాలి



గతంలో కళాకారులకు ఇచ్చిన స్థలాలను రాజకీయ నేతలు ఆక్రమిస్తున్నారు. రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని డీవీసత్రానికి చెందిన కళాకారులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వీరికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, రామ్మూర్తి, మునేంద్ర, సాయి, శ్రీను, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

- జానపద వృత్తి కళాకారుల సంఘం, డీవీ సత్రం

ఉర్దూ పాఠశాల విలీనం తగదు



'రేణిగుంటలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిందని తెలుగు ఆదర్శ పాఠశాలలో విలీనం చేస్తున్నారు. ప్రభుత్వం ఉర్దూను రెండవ అధికార భాషగా ప్రకటించింది. అందువల్ల ప్రస్తుతం ఉన్న ఉర్దూ పాఠశాలను బేసిక్ ప్రైమరీ పాఠశాలగా కొనసాగించాలి' అంటూ ముస్లిం మైనార్టీలు జిలానీబాషా, గౌస్‌పీర్, మునీర్ తదితరులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు.

16 ఏళ్లు పనిచేస్తే పీఎఫ్ తినేశారు



వెంకటగిరి పంచాయతీగా ఉన్న సమయం నుంచి మున్సిపాలిటీ వరకు పారిశుధ్య కార్మికురాలిగా పనిచేశాను. 16 ఏళ్లు పీఎఫ్ కూడబెట్టాను. ఆరోగ్యం బాగోలేక పనికిపోవడం మానేశాను. పీఎఫ్ ఉంది కదా ఆ డబ్బుతో జీవనం సాగిద్దామని మున్సిపాలిటీకి వెళ్లి అడిగితే పై అధికారులు తినేశారని చెప్పారు. పీఎఫ్ ఇవ్వకుండా నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

- సుబ్బమ్మ, మున్సిపల్ కార్మికురాలు, వెంకటగిరి.

మా భూమిని కబ్జా చేశారు



అయ్యా, మాది ఏర్పేడు మండలం గోపాలపురం. దివ్యాంగుడిని. బతుకుదెరువు కోసం బయట ఊరికి వెళ్లిన సమయంలో అయ్యప్ప అనే వ్యక్తి మా పెద్దల నుంచి సంక్రమించిన 5సెంట్ల భూమిని కబ్జా చేశాడు. దీనికి రెవెన్యూ అధికారులు కూడా సహకరించారు. కలెక్టరేట్ చుట్టూ మూడేళ్లుగా తిరుగుతున్నా, ఇకనైనా న్యాయం చేయండి.

-పోలయ్య, గోపాలపురం, ఏర్పేడు.

ఉపాధి కల్పించండి



అయ్యా నేను, నా భార్య దివ్యాంగులం. ఇద్దరం పదవ తరగతి వరకు చదువుకున్నాం. ఆర్థికంగా ఉపాధి పొందేందుకు దివ్యాంగుల కోట కింద రుణం మంజూరు చేసి కిరాణాకొట్టు పెట్టుకు నేందుకు ఉపాధి కల్పించండి.

- ప్రదీప్, మయూరి, పేరూరు, తిరుపతి రూరల్

షార్‌లో ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



ఎన్‌ఎఫ్‌ఎస్‌సీ డైరెక్టర్ సింఘానేకు జ్ఞాపిక అందజేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కన కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకలు నిర్వహించారు. నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజ్(ఎన్ఎఫ్ఎస్‌సీ) డైరెక్టర్ ఎన్‌బీ సింఘానే ముఖ్య అతిథిగా విచ్చేసి అగ్నిమాపక వారోత్సవాల ప్రాముఖ్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, ఎస్‌వీఎస్ఈ సీజీఎం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విందూరు రోడ్డును అభివృద్ధి చేయండి

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి సైదాపురం మండలం గిద్దలూరుకు విందూరు మీదుగా వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఈఈ రామాంజేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గూడూరు నుంచి గిద్దలూరుకు విందూరు మీదుగా వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. ఈ మార్గంలో ఉన్న 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాత్రి వేళల్లో గోతులు కనిపించిక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సునీల్, బ్రహ్మయ్య, వేమయ్య, సుబ్బరామరాజు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎంయూపీ నేతలు

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎంయూపీ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించడంతో పాటు వృద్ధాప్య పెన్షన్‌ను అందజేయాలన్నారు. మహిళా కండక్టర్లకు సంబంధించి అన్ని రకాల సెలవులను అమలు చేయాలని కోరారు. అలాగే అర్హత ఉన్నవారందరికీ పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రవీణ్, గౌస్, పోలయ్య, బాబురావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే బలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఇస్తామని, ఇందులో ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోటలో సోమవారం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల టీడీపీ మండల అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన మద్దాలి సర్వోత్తమరెడ్డిని తిరిగి ఆహ్వానించారు. తనకు ఎవరితోనూ విభేదాలు లేవని, ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆదేశాలతో పార్టీలో కీలకంగా వ్యవహరిస్తానని సర్వోత్తమరెడ్డి సభాముఖంగా ప్రకటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ పటిష్టత కోసం అందరితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలోని నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, గండవరం కృష్ణారెడ్డి, తీగల సురేష్‌బాబు, మస్తాన్‌బాషా, కోటేశ్వరరెడ్డి, నారాయణ, షంషూద్దీన్, పోలయ్య, వెంకటకృష్ణారెడ్డి, సుహాసిని, పోలమ్మ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించండి



ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను విడివిడిగానే నిర్వహించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యారంగంలో గత వైసీపీ ప్రభుత్వం అవలంభించిన విధానాలనే నేటి ప్రభుత్వం కొనసాగిస్తుండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

వెంకటగిరి, మే 5:(ఆంధ్రజ్యోతి) సమస్యల సాధన కోసం సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ, సాయిరామ్, భాస్కర్ యాదవ్, శంకరయ్య, కిషోర్‌బాబు, బోడ రమణయ్య, జోనేష్ తదితరులు పాల్గొన్నారు

8నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

చిల్లకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఈనెల 8నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమ వారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆయన నివాసంలో ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేం దుకు ఉత్సవ కమిటీని నియమించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ నెల్లటూరు చిరంజీవి, బాబి పాల్గొన్నారు.

చదరంగంలో సత్తాచాటిన జశ్వితారెడ్డి



పెళ్లకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరు గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, అనూష దంపతుల కుమార్తె జశ్వితా రెడ్డి చదరంగంలో సత్తా చాటింది. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి చందరంగం పోటీల్లో అండర్ 9 బాలికల విభాగంలో జశ్వితారెడ్డి ప్రతిభ చూపి నాలుగవ స్థానంలో నిలిచింది.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం: పాశిం



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో సీపీ హ్యాచరీస్ ప్రతినిధులు

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో సీపీ హ్యాచరీస్‌కు చెందిన ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వాకాడు మండలం తూపిలిపాళెం గ్రామంలో సీపీ హ్యాచరీస్ సంస్థ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ, నాణ్యమైన రొయ్యల పిల్లలను ఉత్పత్తి చేస్తూ రొయ్యల సాగుకు సహకారం అందిస్తూ వచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల నిర్వహణకు ఎటువంటి ప్రోత్సాహకాలు అందించకపోవడంతో ఈ సంస్థను మూసివేయడం జరిగిందన్నారు. దీంతో ఈ పరిశ్రమపై ఆధారపడి పనిచేసే వేలాది మంది కార్మికులకు పనులు లేకుండా నిరుద్యోగులుగా మారారన్నారు. రాష్ట్రప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టిందని, మూతపడిన సీపీ హ్యాచరీస్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పరిశ్రమ ప్రతినిధులతో చర్చించి తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, త్వరలోనే పరిశ్రమను పునః ప్రారంభించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రొయ్య రైతులకు నాణ్యమైన రొయ్యపిల్లలను అందించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమ ప్రతినిధులతో చర్చించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధి లడ్వాన్, మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ నగదు స్వాహాపై విచారణ

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం



కేశవరం సచివాలయంలో సిబ్బందిని విచారిస్తున్న అధికారులు

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ స్వాహా విచారణ సోమవారం జరిగింది. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజ్‌తో పాటు మండల పరిషత్ అధికారులు కేశవరం సచివాలయానికి చేరుకుని ఏప్రిల్, మే మాసాలకు సంబంధించి పెన్షన్ నగదుపై వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్‌ను విచారించారు. ఏప్రిల్‌లో డీఆర్‌డీఏకు జమ చేయాల్సిన రూ.1,30,500 నగదును ఈనెల 2వ తేదీ గ్రామస్తుల సమక్షంలో అధికారుల వత్తిళ్ల మేరకు జమ చేసినట్లు గుర్తించారు. అదేవిధంగా మే నెలకు సంబంధించి రూ.1.12లక్షల పెన్షన్ నగదును వెల్ఫేర్ అసిస్టెంట్ ఇప్పటికీ డీఆర్‌డీఏకి జమ చేయలేదు. నగదు స్వాహాపై అధికారులు విచారిస్తుండగా ఒక్కసారిగా వెల్ఫేర్ అసిస్టెంట్ పరిగెత్తుకుంటూ వెళ్లి సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జామాయిల్ తోటలోకి వెళ్లి పురుగుమందు తాగి పడిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయనను గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించగా కోలుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు మాట్లాడుతూ ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో రూ .1.50లక్షల పెన్షన్ నగదు స్వాహాపై వార్త ప్రచురితం అయిందని, దీనిపై విచారణ చేయగా వాస్తవమేనని తేలిందన్నారు. ఈ క్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం ప్రయత్నం చేశాడని, ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని పంచాయతీ కార్యదర్శి చెప్పారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయొచ్చు



దగ్గవోలులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దక్కిలి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయొచ్చునని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి బిందుప్రియాంక తెలిపారు. తిరుపతిలోని వెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం డక్కిలి మండలంలోని దగ్గవోలు, సంగనపల్లి గ్రామాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రాం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తించేందుకు 35 ఏళ్లు దాటిన మహిళలందరూ మెమూగ్రాం పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ వరకు వైద్య శిబిరాలు జరుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజు, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, సంగనపల్లి, దగ్గవోలు సర్పంచులు చిరంజీవులు, కోలా చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు రమేష్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధర్మరాజస్వామి ఉత్సవాలు

తడ, మే 5 (ఆంధ్రజ్యోతి): పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం పంచపాండవుల విజయ సోపాన గ్రామోత్సవం జరిగింది. సోమవారం ధర్మరాజస్వామికి పట్టాభిషేకం వేడుకలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పట్టాభిశక్తులైన ద్రౌపది సమేత ధర్మరాజు పుష్ప వాహనంలో విజయయాత్ర గ్రామోత్సవం జరిపారు. రాత్రి శయనసేవ నిర్వహించి ఉత్సవాలను ముగించారు.

అత్తివరంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ఓజిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. తెలుగు యువత నాయకులు, గురుమూర్తి అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దంత వైద్యుడు కనుమూరు క్రాంతికుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, విరజ, అనిత, శశిరేఖ, భవానీ, సుధీర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

గూడూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదలకు తిరుమలశెట్టి నారాయణ దాతృత్వంతో ఆహార పొట్లాలను అందజేశారు.

వీధి లైట్లను బాగు చేయండి

వెంకటగిరి టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో వీధి లైట్లను బాగు చేసి వెలిగేలా చూడాలని స్థానికులు కౌన్సిలర్ ఆరి శంకరయ్యను కోరారు. సోమవారం 8వ సచివాయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మహిళకు కుట్టుమెషిన్ అందజేత

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): కోటలోని షిరిడిసాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద మహిళకు కుట్టుమెషిన్ అందజేశారు. వాకాడు మండలం సిద్ధిగుంటపాళెం గ్రామానికి చెందిన వాకాటి శ్రీలక్ష్మి నిరుపేద. ఆమె కుట్టు, అల్లికలు నేర్చుకుంది. కుట్టుమెషిన్ కొనుక్కునేందుకు ఆర్థిక స్థోమతలేక షిరిడిసాయి అక్షయ సేవా సమితిని ఆశ్రయించింది. స్పందించిన ఆ సంస్థ ప్రతినిధి అల్లం రమణయ్య నెల్లూరుకు చెందిన రావూరి వెంకటేశ్వర్లు దాతృత్వంతో శ్రీలక్ష్మికి కుట్టు మిషను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కోటేశ్వరరెడ్డి, సుబ్బయ్య, పన్నగ సాయి, బాబురావు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



డీటీ ప్రసన్నరాణికి వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నేతలు

దక్కిలి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపూరు క్రాస్ రోడ్డులో సర్వే నంబరు 522లో అంబేడ్కర్ విజ్ఞాన మందిరం కోసం దరాఖాస్తు చేసుకున్న స్థలాన్ని ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది నకిలీ పట్టాలతో ఆక్రమించుకుని గుడిసెలు వేస్తున్నారని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య ఆరోపించారు. సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మలమహానాడు నాయకుడు మునెయ్య, ఎరుకుల హక్కుల పోరాట కమిటీ నాయకుడు రవి, ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేది మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెసర సాగుపై అవగాహన



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి

వెంకటగిరి టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద రైతులకు శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి పెసర సాగుపై అవగాహన కల్పించారు. రైతులు వరి కోసిన తరువాత ఆరుతడి పంటగా పెసర సాగు చేసుకోవాలన్నారు. పెసర సాగులో రకాలు, విత్తన మోతాదు, విత్తన శుద్ధి, పోషకాలు, నీటి యాజమాన్యం, కలుపు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఎల్‌జీజీ-607 పెసర విత్తనాలు మేలు రకమని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజీవన, విజయశ్రీ, నాగార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్ల నిర్మాణానికి కృషి చేయండి



ఎంపీ గురుమూర్తితో వెంకటకృష్ణారెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి తూర్పుకనుపూరు వరకు నూతనంగా నిర్మిస్తున్న సాగరమాల జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించేలా చూడాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తికి మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం తిరుపతిలో ఎంపీని కలసి సర్వీస్ రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయసారధి రెడ్డి, సురేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, భవదీప్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో విజిలెన్స్ తనిఖీలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. డిపోలో పరిపాలన విభాగంలో పనితీరు, అక్రమాలపై నెల్లూరు విజిలెన్స్ డీఎస్పీ ధర్మతేజ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరాతీసి పలు రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది. గత మూడేళ్ల నుంచి డిపోలో పాలన గాడితప్పడమే కాకుండా గతంలో నడుస్తున్న 60 బస్సులు సర్వీసులు నేడు 29కి చేరాయి. అలాగే తరచూ బస్సు సర్వీసులు రద్దు చేయడం పరిపాటిగా మారింది. సిబ్బంది ఉన్నా సర్వీసులను ఎందుకు రద్దు చేస్తున్నారు.. డిపోకు ఆదాయ చేకూర్చే మార్గాల్లో సర్వీసులు పెంచుకోకుండా ఎందుకు కుదిస్తున్నారన్న దానిపై విజిలెన్స్ అధికారులు విచారించారు. ఏప్రిల్ 20న ఒకేరోజు డిపోలో 17 సర్వీసులను రద్దు చేశారు. దీనిపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. కనుపూరు జాతరకు స్పెషల్ సర్వీసులకు నడిపినా సిబ్బందికి నగదు చెల్లించలేదని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అదేవిధంగా ఏళ్ల తరబడి కొంతమంది సిబ్బంది విధులకు దుమ్మాకొట్టి ఓడీల్లో ఎందుకు ఉంటున్నారన్న అంశంపై ఆరా తీశారు. షెడ్యూల్ ప్రకారం బస్సులను ఎందుకు నడపటం లేదు తదితర వివలాన్నింటినీ సేకరించారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



హుండీ నగదు లెక్కిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 50 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2,29,216 ఆదాయం వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మంగళవారం, బుధవారాల్లో జాతర నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగా హుండీ నగదును లెక్కించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, జాతర కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, సభ్యులు గోపి, శ్రీనివాసులు, శ్యామ్, రామారావు, ధనుంజయ, అన్నమనేని సాయి, స్థానికులు అంజయ్య, చిరంజీవి ఆచారి, నిత్య కృష్ణారెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లా, నాయకులు పార్థసారధి, గూడూరు సుధీర్‌రెడ్డి, పొట్లపూడి రాజేష్, దార్ల రాజేంద్ర, తుపాకుల కన్నెమ్మ, చేవూరు చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులకు దూరంగా ఉండాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామని, రాత్రి సమయాల్లో గస్తీలో ఉండే పోలీసు సిబ్బంది రౌడీ షీటర్లు ఉండే నివాసాలను ఖచ్చితంగా తనిఖీ చేస్తారని చెప్పారు. రౌడీ షీటర్లు బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సెలింగ్ ద్వారా ప్రవర్తనలో మార్పు వస్తే వారిపై రౌడీషీట్ ఎత్తివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

రేపటినుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డులో వెలసిన మద్విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు చిట్టేటి పెరుమాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన ప్రతులను సోమవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. తొలిరోజు 7న గణపతి పూజ, గోపూజ, హోమం, 8న స్వామి, అమ్మవార్ల కల్యాణం. 9న ఉదయం హోమం, రాత్రి గ్రామోత్సం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో చిట్టేటి రామదాసు, చిట్టేటి విజయ్‌కుమార్, చెంగయ్య, బట్టా సుబ్రహ్మణ్యం, నూలేటి రమణయ్య సతీష్, వెంకటేశ్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పండ్ల పంపిణీ

గూడూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు దాతృత్వంతో బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గౌరీ, సురేష్, మల్లి, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా గుడిసెలు

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు


ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన గుడిసెలు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 5 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఎదుట విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి అవుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుం డడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. మండల సముదాయంలోని సర్వే నెం.252, 253, 254లలో సుమారు 5 ఎకరాలున్నాయి. ఈ భూమిలో కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి స్థలాల కేటాయించాలంటూ రిలే దీక్షలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సంఘటనా స్థలానికి చేరుకుని అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇవ్వడంతో దళితులు దీక్షలు విరమించారు. తహసీల్దార్ శ్రీదేవి సిబ్బందితో వెళ్లి కనమనంబేడులో ఇంటి స్థలాల కేటాయింపు కోసం ఇంటింటా సర్వే చేపట్టారు. అయితే సర్వేలో అర్హులు లేరని, దళితులు కోరే భూమి మండల సముదాయంకు కేటాయించిన భూమి అంటూ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం దళితులు పెద్ద ఎత్తున గుడిసెలు వేశారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా... ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులున్నా ఆక్రమించారని తెలిపారు. దీంతో పలువురిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

కార్మికుల ఊపిరి కార్ల్‌మార్క్స్

శ్రీకాళహస్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికుల ఊపిరి కమ్యూనిస్టు పితామహుడు కార్ల్‌మార్క్స్ అని సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం కార్ల్‌మార్క్స్ జయంతిని నిర్వహించారు. మనిషిని మరో మనిషి దోపిడీ చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని ఆయన ఉద్భుతం చేశారని కొనియాడారు. సమాజంలో అందరికీ తిండి, ఇల్లు, దుస్తులు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంధం మణి, గురవయ్య, కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యం, రాధమ్మ, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా ఆయనకు సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కందారపు మురళి ఆధ్వర్యంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర, తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురండి

● శాప్ చైర్మన్‌కు నేతల వినతి



సత్యవేడు, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన మినీ క్రికెట్ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడిని స్థానిక టీడీపీ బీసీ నేత జక్కుల శివానందం, దేవాంగ సంఘం రాష్ట్ర నాయకుడు గుత్తి త్యాగరాజు కోరారు. మంత్రి లోకేశ్ సత్యవేడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు సత్యవేడు వచ్చిన రవినాయుడిని వీరు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. అనంతరం సత్యవేడు మినీ స్టేడియానికి శాశ్వత కోచ్‌ను నియమించి, క్రీడాకారులను తీర్చి దిద్దాలని కోరారు.

పుత్తూరు వార్తలు

అక్రమ లే అవుట్లపై పట్టణ ప్రణాళిక విభాగం కొరడా


అనధికార లే అవుట్‌లో హద్దు రాళ్ల తొలగింపు

పుత్తూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో అక్రమ లే అవుట్లపై పట్టణ ప్రణాళిక విభాగం కొరడా ఝుళిపించింది. సోమవారం గోవింద పాళెంలోని సర్వే నెం.228లో 30 సెంట్లు, చెర్లోపల్లిలో సర్వే నెంబర్ 163/1, 2, 3, 4, 7, 134లో 4.20 ఎకరాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన లే అవుట్లను పీవో నీరజాక్షి ఆధ్వర్యంలో హద్దు రాళ్లతో పాటు సర్వే రాళ్లను తొలగించారు. సదరు లే అవుట్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలు కూడా ఇటువంటి అక్రమ లే అవుట్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనుమతులు లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వమన్నారు. అంతేకాకుండా మౌలిక వసతులు రోడ్లు, విద్యుత్, నీరు, కాలువలు ఏర్పాటు చేయరన్నారు. లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేయాలని భావిస్తే మున్సిపల్ కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ దాడుల్లో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

పుత్తూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నియంత్రణకు కిశోరి వికాసం గ్రూపులు పటిష్ఠం కావాల్సి ఉందని సీడీపీవో ప్రమీల పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాలులో అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా ఆర్పీలు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులకు కిశోరి వికాసంపై శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాల నిరోధం, బాలల హక్కులు, లింగ సమానత్వం, బాలికల విద్యా ప్రాముఖ్యం, సైబర్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో అంగన్‌వాడీ పరిధిలోని బాలికలకు సమావేశాలు నిర్వహించి 12 అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి తహసీల్దార్‌కు వినతి


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పుత్తూరు, మే 5(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించాలని పుత్తూరు ఆర్టీసీ ఎన్ఎంయూఏ సభ్యులు తహసీల్దార్ కార్యాలయ అధికారి గురుస్వామికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ కార్మికులను గుర్తించినందున మండలాధికారిని కలిశామన్నారు. దశలవారీ ఉద్యమంలో భాగంగా నేడు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వినతిపత్రం సమర్పించామన్నారు. సుందరం, రాయులు, శేఖర్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

పుత్తూరు, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ మూడున్నర నెలల పాటు ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ లోగా కళాశాలలోని స్కిల్ హబ్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం నెం.6300954441లో సంప్రదించాలని కోరారు.

నంది వాహనంపై సదాశివుడి చిద్విలాసం



పుత్తూరు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదా శివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామిఅమ్మవార్లు నంది వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం 7.30 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి ఆదిశేష వాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఆరుగురు బడి బయట పిల్లలకు అడ్మిషన్లు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయి గిరిజన కాలనీలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఉన్నత పాఠశాల హెచ్ఎం పురుషోత్తం ఆధ్వర్యంలో బడి మానేసిన ఆరుగురు విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ కల్పించారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో పట్టణవాసులు విలవిల



వైష్ణవ కోనేరు వద్ద , నెహ్రూవీధిలో స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య నరకాన్ని తలపిస్తోంది. సిబ్బంది కొరత తీవ్రంగా వెంటాడుతుండటంతో ఇక్కట్లు తప్పడంలేదు. వేసవిలో ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న వాహనదారులు, పట్టణ ప్రజలు విలవిలలాడుతున్నారు. శ్రీకాళహిస్త పట్టణాన్ని దాదాపు రెండు దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మినీ బైపాస్, భక్తకన్నప్ప వంతెన సహా ఆరు లేన్ల జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చినా తీరడం లేదు. పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడంతో పాటు ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. వందలాది గ్రామాలకు శ్రీకాళహస్తి కేంద్రం కావడంతో పొరుగు మండలాల్లోని వేలాది మంది నిత్యం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. పదేళ్ల నుంచి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు జరిగాయి. ఎనిమిది నెలల క్రితం శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ విభాగం కోసం ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 12మంది కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించేవారు. ఇందులో ఆరు నెలల క్రితం నలుగురు బదిలీ అయ్యారు. తరువాత ఇటీవల నిర్వహించిన బదిలీల్లో మరో ఆరుగురు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ప్రస్తుతం ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు మాత్రం మిగిలారు. పదిమంది సిబ్బంది బదిలీ అయినప్పటికీ వారి స్థానాలు భర్తీ కాలేదు. దీంతో పదిమంది మాత్రమే ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేస్తున్నారు. రద్దీ వేళల్లో పట్టణ ప్రధాన రోడ్లు వాహనాలతో కిక్కిరిసి పోతున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, సాయంత్రం 6నుంచి 9గంటల వరకు ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళలో ప్రస్తుతం సిబ్బంది చాలా కూడళ్లలో లేకపోవడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. అసలే వేసవి ఆపై వాహనదారులు రోడ్లలో స్తంభించిపోవడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నంది వాహనంపై అగస్త్యేశ్వరుడి విహారం



నారాయణవనం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంగా ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారిని నంది వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని నంది వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


ఆరోగ్య మందిర్ ప్రారంభోత్సవం

నారాయణవనం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. సోమవారం మండలంలోని అరణ్యంకండ్రిగ వద్ద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల వ్యాధుల నివారణతో పాటు సమగ్ర ఆరోగ్య సంరక్షణను ఆరోగ్య మందిర్ కేంద్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. రోగ నిర్ధారణ, మందులను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వి.బాలకృష్ణ నాయక్, మండల వైద్యాధికారులు దర్శిత్‌రాజ్, రాగసుధ, ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ జయరాములు, డిప్యూటీ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

కందకాల పూడిక తీయండి


తోటల యజమానులతో హేమలత

రేణిగుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరులో ఏనుగుల విధ్వంసంలో నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని తోటల యజమానులు కోరారు. సోమవారం ఏనుగుల ధ్వంసం చేసిన తోటలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత పరిశీలించారు. ఏనుగులు తోటల్లోకి ప్రవేశించకుండా తక్షణం కందకాలను పునరుద్ధరించాలని కోరారు. సీపీఎం ప్రాంతీయ కన్వీనర్ హరినాథ్, కార్యదర్శి సెల్వరాజ్ పాల్గొన్నారు.

రక్షణ గోడను ఢీకొన్న పాల ట్యాంకర్

రేణిగుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన పాల ట్యాంకర్ రక్షణ గోడను ఢీ కొనింది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం మల్లిగుంట వంతెన వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... నెల్లూరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న పాల ట్యాంకర్ మల్లిగుంట జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొంది. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను పక్కకు తీశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, మే 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుధీర్ కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఎమ్మెల్యే పలు అంశాలపై చర్చించారు. నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని కోరారు. అలాగే నియోజక వర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం పనిచేసేలా పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవీంద్రనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన


ఘన జీవామృతం చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాం పెద్దమిట్టకండ్రిగలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం ఆధ్వర్యంలో ఘన జీవామృతంపై అవగాహన కల్పించారు. రైతు జయలలిత ఇంటి వద్ద 200 కేజీల ఘనజీవామృతం తయారు చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రకృతి సేద్యంలో ఈ విధంగా తయారుచేసి యూరియా, డీఏపీలకు ప్రత్యామ్నాయంగా పంట వేసే ఆఖరి దుక్కిలో 400 కిలోలు వేయడం ద్వారా ఎలాంటి రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. భూమి ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి వద్ద పెరటి తోటలు వేసుకోవాలన్నారు. అలాగే పొలాల్లో ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్ వేసుకుని మెరుగైన జీవనోపాధి, ఆదాయం పొందవచ్చన్నారు. డీఎంఎంటీ వెంకటేశ్వర్లు, సౌందర్య బాబు, ఎంటీ ఉదయ్‌కిరణ్, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం వద్దు

శ్రీకాళహస్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం కల్పించవద్దని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్న చోట 6, 7వ తరగతులు ఉన్న పాఠశాలల్లో నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8వ తరగతులు ఉన్న చోట్ల ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం రెండు ఎస్‌టీజీ పోస్టులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ విద్యావిధాం, విద్యాహక్కు చట్టంలో పేర్కొన్నవిధంగా అన్ని పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని తెలిపారు. సుధాకర్, భువనేశ్వరి, నీరజమ్మ, జ్యోతి, లక్ష్మమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూలుగానే కొనసాగించండి

రేణిగుంట, మే 5, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూలుగానే కొనసాగించాలని కలెక్టర్‌కు ముస్లింలు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ మునీర్ మాట్లాడుతూ... ఉర్దూ పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు 70మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారిని తెలుగు ఆదర్శ పాఠశాలలో విలీనం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని కోరారు.

ప్రతి ఉపాధి కూలీ బీమా చేసుకోవాలి

కేవీబీపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ప్రధాన మంత్రి యోజన బీమా తప్పనిసరిగా చేసుకోవాలని ఏపీవో భాస్కరయ్య తెలిపారు. మండలంలోని దిగువపుత్తూరులో ఉపాధి కూలీలకు బీమాపై అవగాహన కల్పించారు. ఉపాధి కూలీ మరణిస్తే జీవితబీమా కింద ప్రభుత్వం రూ.లక్ష ఇస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి బీమా యోజన కింద కూలీ మరణిస్తే రూ.2లక్షలు సాయం అందజేస్తుందని తెలిపారు. త్వరలోనే కూలీలకు నీడ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని రూ.307 కూలీని ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు.

ప్రయాణికులే టిక్కెట్ తీసుకునే బాధ్యతను అమలు చేయాలి

సత్యవేడు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులే టిక్కెట్ తీసుకునే బాధ్యతను చట్టపరంగా అమలు చేయాలని సత్యవేడు ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఎన్ఎంయూఏ సెక్రటరీ వి.బాబు కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయంలో యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ... డిపోలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, సదుపాయాలు కల్పించాలని కోరారు. సంస విశ్రాంత ఉద్యోగులకు వృద్ధాప్య పింఛను, ఆరోగ్యశ్రీ వర్తింప జేయాలని కోరారు. పార్థసారథి, కుప్పయ్య, ఎస్.శేఖర్, సురేష్, ఎంఆర్ రవి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ఏర్పేడు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 1గంట వరకు కంటి వైద్య ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు. రాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుత్తా మునిరత్నం నాల్గో వర్ధంతి సందర్భంగా పాపానాయుడుపేటలోని రాస్ సేవా నిలయంలో శిబిరం జరుగుతుందన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేస్తారన్నారు. తిరుపతికి చెందిన వాసన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నదానానికి విరాళం

ఏర్పేడు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో నిర్వహించే అన్నదానానికి విజయవాడకు చెందిన కొడాలి వీరకుమార్ సోమవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ సొమ్మును ఈవో, మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా 9వ తేదీ అన్నదానం నిర్వహించేలా చూడాలని ఆలయ అధికారులను ఆయన కోరారు.

ఈకేవైసీ, మన మిత్ర తప్పనిసరి

కేవీబీపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఈకేవైసీ, మనమిత్రలను చేసు కునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో మాలతి చెప్పారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వడదెబ్బపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యదర్శులు గ్రామాల్లో కార్పొరేషన్ రుణాలకు అర్హత ఉన్న ఎస్సీలను గుర్తించాలని తెలిపారు. ఏవో రాధారాణి, ఈవోపీఆర్డీ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టండి

శ్రీకాళహస్తి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాడ వీధుల్లో పారిశుధ్య పన లు చేట్టాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. నగరి వీధిలో కాలువలను పరిశీలించారు. చిన్నపాటి వర్షం కురిసినా మాడ వీధుల్లో కాలువలు పొంగి మురుగు వీధుల్లో ప్రవహిస్తోందన్నారు. పురపాలకసంఘ కమిషనర్ స్పందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. వైసీపీ నాయకులు శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, సురేష్, విజయ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై దృష్టి పెట్టండి

కేవీపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలపై రెవెన్యూ సిబ్బంది దృష్టి పెట్టాలని తహసీల్దారు మునిరత్నంరెడ్డి ఆదేశించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో వాటి వివరాలను ఆర్డీవో కార్యాలయానికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అవకతవకలకు పాల్పడకుండా పక్కాగా సర్వే నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.